క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ముఖ్యమంత్రి నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయాలని బాలునాయక్ సీఎంను కోరారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనమైత్రి ఫౌండేషన్ నూతన కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ అర్బన్ : జనమైత్రి ఫౌండేషన్ నూతన కమిటీని ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కై రేలీ పాఠశాలలో ఎన్నుకున్నారు. ఫాదర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎండీ మునీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడిగా తుమ్మడం గ్రామానికి చెందిన పల్లె కిశోర్‌కుమార్ గౌరవ అధ్యక్షుడిగా, డాక్టర్ బాలాజీ నాయక్ హైమద్ ఖాన్, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులుగా గాదె నరసింహారెడ్డి, దయాకర్‌రెడ్డి, జజాల కృష్ణ, సైదులు, కంచర్ల ఏకాంబర చారి, ఉదయ్‌కిరణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భాష, విష్ణు, సైదా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో ఎస్‌ఐ

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొల్లెరో ట్రాలీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. పెద్దవూర నుండి కల్వకుర్తికి అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి ఈ మేరకు ఒకరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యను వ్యాపారంగా నిర్వహిస్తున్న ప్రభుత్వాలు

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పాగుల సైదులు గౌడ్ ఆరోపించారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పుస్తకాలు, ఫీజుల పేరుతో వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారంతో పాటు టై, బెల్ట్ వంటివి విచ్చలవిడిగ ప్రైయివేటు పాఠశాలల యాజమాన్యం అమ్ముతున్నప్పటికి పట్టించుకోకపోవడం విడ్డురంగా ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బైరం వెంకటేశ్వర్లు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ ఆదివారం బైరం వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం పట్టణ అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్, బైరం కృష్ణ, బైరం శ్రీను, సురేష్, మేరం కృష్ణ, చింతకుంట్ల రవి, శ్రీను, ప్రకాశ్, పాల్గొన్నారు.

ఆవులు పట్టివేత

కొండమల్లేపల్లి : డీసీఎం వాహనంలో తరలిస్తున్న ఆవులను కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ఆదివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ డీసీఎం వాహనంలో తరలిస్తున్న 12 ఆవులను గుర్తించినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. గోవులను గోశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నిడమనూరు : మండలంలోని వేంపాడ్‌లో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బైరెడ్డి యశ్వంత్ రెడ్డితో కలిసి ఎస్‌ఐ గోపాల రావు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బుర్రి పరమేష్, శ్రీను, విజయ్, రాము, ఉమాశంకర్, మధు, నాగరాజు, జానీ, మదుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భయం..భయంగా బడికి

- శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం
- తరగతి గదిలో పెచ్చులూడిపడుతున్న పైకప్పు
- భయాందోళనతో చెట్లకిందనే చదువులు
- ప్రారంభం కాని మన ఊరు- మనబడి పనులు



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



పెచ్చులూడుతున్న తరగతి గది

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది. ఆ పాఠశాల భవనం నిర్మించి ఐదు దశాబ్దాలు దాటింది. ఎప్పుడు కూలిపోతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొనడంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మా ప్రభుత్వం కషి చేస్తోందని, ప్రతి బడ్జెట్‌లో విద్యారంగా సమస్యల పరిష్కారానికి వేయిల కోట్ల రూపాయలను ప్రవేశపెడుతున్నామని పాలకులు చెబుతున్నా అవి ముచ్చటకై నా ఎక్కడా కనిపించడం లేదు. విద్యార్థుల సంఖ్యాపరంగా తరగతి గదులు నిర్మించాల్సి ఉన్నా కాని అవి మండలంలో ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వం పైసలను విడుదల చేసినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చెట్లకిందనే చదువులు

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవనం 1965వ సంవత్సరంలో నిర్మించారు. అంటే ఇప్పటికీ 59 ఏళ్లు అవుతోంది ఆ భవనం నిర్మించి. పాఠశాలలో మొత్తం ఐదు గదులను నిర్మించగా అందులో ప్రస్తుతం మూడు గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఆ మూడు గదులకు ఉపాధ్యాయులు తాళాలు వేశారు. ఆ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 94మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మూడు తరగతి గదులు శిథిలావస్థకు చేరడం రెండు తరగతుల గదులు మాత్రమే ఉండటంతో మిగతా మూడు తరగతుల విద్యార్థులను వరండాలో, చెట్లకింద కూర్చొబెట్టి బోధిస్తున్నారు. వర్షం వస్తే వీరి పరిస్థితి మరీ అధ్వానం. వర్షానికి ఆరుబయట కూర్చొవడం వీలుకాకపోవడంతో స్టాఫ్‌రూంలో కూర్చొబెట్టి బోధిస్తున్నారు. దీంతో పాటు పాఠశాల వంటగది రేకులు కూడా శిథిలమవ్వడంతో భోజనాన్ని ఆరుబయటే వండుతున్నారు.

నిధులు మంజూరైనా...

తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలను గత ప్రభుత్వం 'మన ఊరు –మన బడి' పథకంలో ఎంపిక చేసింది. సుమారు రూ. 34 లక్షల వ్యయంతో పాఠశాలలో రెండు నూతన గదుల నిర్మాణం, తాగు నీరు, ప్రహరీ నిర్మాణంతో పాటు పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ ఎలాంటి పనులు మాత్రం జరగలేదు. ఒక్క కరెంట్ పని మాత్రమే పూర్తి చేశారు. మిగతా పనులు పూర్తిగా అలాగే నిలిచిపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ×మన ఊరు – మన బడి×కి బదులుగా అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పేరు మార్చింది. మన ఊరు – మన బడిలో ఎంపికైనవి కాకుండా మిగత పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. గత ప్రభుత్వంలో మన ఊరు మన బడి పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు విడుదల చేసిన నిధులను కూడా ప్రస్తుతం వెనక్కి తీసుకుంటున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో ఆ పాఠశాలల పరిస్థితి ఏంటని అనేది ప్రశ్నార్థకంగా మారింది.

తరగతి గదుల్లోకి వెళ్లాలంటే భయమేస్తోంది



పాఠశాల భవనం పై కప్పు పెచ్చులూడి కిందపడటంతో తరగతి గదుల్లోకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. వర్షం వచ్చినప్పుడు గదుల్లోకి నీరుచేరి అపరిశుభ్రంగా మారుతోంది. తరగతి గదులు కూడా సరిపడా లేకపోవడంతో ఆరుబయట కూర్చొబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. దీంతో మాకు చాలా ఇబ్బందిగా ఉంది. సరిగా పాఠాలు వినలేకపోతున్నాం.

– హారిక, ఐదో తరగతి విద్యార్థినీ

ఆరుబయటే కూర్చుంటున్నాం



మా పాఠశాలలోని గదులు శిథిలావస్థలకు చేరడంతో ఆరుబయట కూర్చొబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇలా ప్రతి రోజూ చెట్లకొంద కూర్చొవాలంటే ఇబ్బందిగా ఉంది. త్వరగా పాఠశాల భవనాన్ని నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి.

– జయవర్ధన్, నాలుగో తరగతి విద్యార్థి

సమస్య పరిష్కరించాలి



పాఠశాల భవనం శిథిలావస్థలకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. గత ప్రభుత్వంలో మన ఊరు – మన బడిలో భాగంగా ఎంపికైనా పనులు మాత్రం జరగలేదు. ఆ నిధులు కూడా వెనక్కిపోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కొన్నేళ్ల నుంచి ప్రజాప్రతినిధులకు, అధికారులకు పదుల సార్లు సమస్యను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేసినా పరిష్కారం కావడం లేదు. ఇప్పటికై నా, అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కొంగరి సత్యనారాయణ, హెచ్‌ఎం

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ఆనంద్

త్రిపురారం : చదువుతోనే సమాజంలో ఉన్నతమైన గుర్తింపు వస్తుందని బంజారా మహిళ ఎన్‌జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్ అన్నారు. త్రిపురారం, దామరచర్ల, అడవిదేవుల పల్లి, మిర్యాలగూడల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో 9నుంచి 10జీపీఏ సాధించిన విద్యార్థులకు బంజారా మహిళా ఎన్‌జీఓ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ ఆనంద్, హరిప్రియ సంయుక్తంగా ఆదివారం మండలంలో ఇస్లావత్ తండాలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో విద్యార్థుల పై చదువులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పేదరికానికి చదువులకు సంబంధం లేదని, విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని తల్లిదండ్రులు, గ్రామానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అభయాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్ ఈసీ గోపాల్ సుజాత, డాక్టర్ పూర్ణిమా, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ అర్బన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని దామరచర్ల మండల సీఐటీయూ కన్వీనర్ బైరం దయానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న ఎమ్మెల్యే ఇళ్ల ఎదుట ధర్నా చేసి వినతిపత్రాలు ఇవ్వడం, 18వ తేది నుంచి 22 వరకు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు వినతి పత్రం ఇవ్వడం, 25, 26 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టాలన్నారు. అదే విదంగా జూలై మొదటి వారంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు వాడపల్లి శ్రీరాములు, సైదులు, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



మిర్యాలగూడ టౌన్ : స్వర్ణకవచాలు బహూకరిస్తున్న ఎన్‌ఆర్‌ఐ చెనుమల్ల అశోక్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సీతారాంపురంలో గీతా మందిర్‌లో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం కొనసాగింది. యాగశాలలో సకలాభిష్టి సిద్ధి కొరకు శ్రీలక్ష్మీనారాయణ, శ్రీసుదర్శన నారసింహ ఇష్టి కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ శ్రీమన్ చెనుమల్ల అశోక్ స్వామివారికి స్వర్ణకవచాలను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు బండారు కుశలయ్య ఆధ్వర్యంలో అశోక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బండారు కుశలయ్య, చీదేళ్ల వెంకటేశ్వర్లు, వేణు, మట్టయ్య, వెంకటదుర్గ ప్రసాద్, యాదగిరి, శ్రీనివాస్, కష్ణమూర్తి, నారాయణరావు, రామారావు, శివకుమార్, సాంబమూర్తి, లక్ష్మీనారాయణ, రాము, లింగయ్య, ఆయిల్ శ్రీను పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : పూజల్లో పాల్గొన్న భక్తులు

వాసవీ మాత దేవాలయంలో..

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని వాసవీమాత దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అష్టలక్ష్మి సహిత వాసవీ మాత విగ్రహాలకు అభిషేకాలు, యజ్ఞం, లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు జనార్ధన్‌ధనమ్మ, నర్సింహ భారతమ్మ, తేరటిపల్లి బుచ్చిరాములుసుజాత, నర్సింహ ఝాన్సీ, వెంకటేశ్వర్లు, ధనుంజయ్య, పూజారులు నాగార్జునశర్మ, నవీనాచారి, నాని పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

చందంపేట : చందంపేట మండల కేంద్రానికి చెందిన చారగొండ వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి వెంకటేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులకు సూచించారు. ఆయన వెంట ముక్కమల వెంకటయ్య, గోసుల అనంతగిరి, మల్లారెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్‌ను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌పీ కన్వెన్షన్‌లో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పాఠశాలల ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవిలో ఉన్నంత కాలం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వెళ్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకొచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం చేపట్టడం హర్షణీయమన్నారు. అనంతరం 10వ తరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులందరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మండల విద్యాశాఖాధికారి బాలాజీనా యక్‌లతో పాటు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు



వాటర్ ట్యాంక్ అందిస్తున్న సభ్యులు

దేవరకొండ : రానున్న రోజుల్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ క్లబ్ రీజియన్ చైర్మన్ కొండూరు శోభన్‌బాబు అన్నారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు ఆదివారం డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా 10వేల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంక్‌లు, 25మంది వీధి వ్యాపారులకు గొడుగులు, ప్రసాద టిఫిన్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఐఈసీ ఆండాళ్, బెలిదె మాధవి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మారం అనిత, ఆలంపల్లి పద్మ, నీలా సంజీవ్‌కుమార్, నీలా భిక్షమయ్య, విజయ, ఆంజనేయులు, పద్మ, పాల్గొనానరు.

మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన



విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన చేస్తున్న కుమ్మర సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సాగర్ రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కూడలి వద్ద రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు మహిళ కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్మాణానికి ఆదివారం కుమ్మర సంఘం నాయకులు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌లు సహకరిస్తున్నట్లు తెఇపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్లకు కుమ్మర సంఘం నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు జమ్మిశెట్టి వేణుబాబు, మల్లికంటి రాంబాబు, రేణుబాయి, బోడ్డుపల్లి లక్ష్మీనారాయణ, కామిశెట్టి రామకృష్ణ, కామిశెట్టి శ్రీను, నీలకంఠం సాంబయ్య, నీలకంఠం అంజమ్మ, అయ్యన్న, గుమ్మడవల్లి రాములు, పుల్లారావు, జి. సైదులు, శ్రీను, అశోక్, శ్రీకాంత్, సైదులు, నర్సింహ్మ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే



దేవరకొండ : కేక్ కట్ చేస్తున్న ఎన్‌వీటీ, తదితరులు



మిర్యాలగూడ టౌన్ : ధీరావత్ హన్యానాయక్‌ను సన్మానిస్తున్న అనాథ పిల్లలు

దేవరకొండ : పట్టణంలోని స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఫాదర్స్ డే ఘనంగా నిర్వహించారు.అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎన్‌వీటీ మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు తండ్రి ఎంతగానో శ్రమిస్తాడన్నారు. నిరంతరం శ్రమించే నిస్వార్థ శ్రామికుడు, పిల్లలకు తొలి స్నేహితుడు తండ్రేనని ఆయన పేర్కొన్నారు.వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికిరెప్పగా కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి.నరసింహ, అంకం చంద్రమౌళి, భాస్కర్, ఉమామహేశ్వర్, పంతునాయక్, నిరంజన్, భాస్కర్ రెడ్డి, సురేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఫెయిత్ బంజారాలో..

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని దుబ్బతండాలోని ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమంలో ఆదివారం ఫాదర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫాదర్స్‌డే సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్‌ను ఆశ్రమం అనాథ పిల్లలు ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధీరావత్ రమాబాయి, పోషయ్య, శ్రీనివాస్, కోటయ్య, స్వామి, జానకిరాం, జనార్ధన్, సైదులు, ఫాల్ పాల్గొన్నారు.

చెన్నకేశవులు త్యాగం మరువలేనిది

నిడమనూరు : పోలీస్ అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులు త్యాగం మరువలేనిదని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆదివారం అన్నారు. నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో వర్ధంతి సందర్భంగా చెన్నకేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి డీఎస్పీ నివాలి అర్పించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. చెన్నకేశవులు 2003 జూన్16న నక్సల్స్ పేల్చిన మందుపాతరకు బలయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాలరావు, చెన్నకేశవులు బంధువులు, మిత్రులుపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెన్నకేశవులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

ముగిసిన మేధా ఫౌండేషన్ శిక్షణ తరగతులు



శిక్షణ తీసుకున్న మహిళలకు ప్రశంసపత్రాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్ : మండలం ఉట్లపల్లిలో మేధా ఫౌండేషన్ కార్యాలయంలో గ్రామీణ మహిళలకు 45 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుట్టుమిషన్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ తీసుకున్న మహిళలకు ప్రశంసపత్రాలు అందజేశారు. మేధా ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగరాజు, వేణుగోపాలచారి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళల కోసం స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇన్‌చార్జ్ నాగమణి, ఫౌండేషన్ వైస్ చైర్మన్ నాగేంద్రబాబు, సభ్యులు శివకుమార్, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, మౌనిక, భారతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

మిర్యాలగూడ టౌన్ : స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోపాలం శివన్నారాయణ, పురోహితులు పి. లక్ష్మీనారాయణశర్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని నవ జ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూర్ఛ, పక్షవాతం, బీపీ, షుగర్ వంటి ఉచి పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ గోపాలం శ్రీమన్నారాయణ ఈ శిబిరంలో 250 మంది రోగులకు పరీక్షలను నిర్వహించారు. అనంతరం డాక్టర్లు శ్రీనివాసరాజు, నామిరెడ్డి శేఖర్‌రెడ్డి, పురోహితులు పి. లక్ష్మీనారాయణ శర్మల సహకారంతో రోగులకు ఉచిత మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవీవీ ప్రతినిధులు కోల శ్రీనివాస్, పాదూరి రమణారెడ్డి, నక్క శ్రీనివాస్, కృష్ణారావు, బి. కోటిరెడ్డి, ఎం. మట్టారెడ్డి, ఎం. కేశవులు, సూర్యనారాయణ, నసీమా, శోభ, మహిత, పి. సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



త్రిపురారం : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



దేవరకొండ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–1996 సంవత్సర పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను తలచుకొని సంతోషంగా గడిపారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కరొక్కరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆనాటి ఈనాటి ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాండురంగా రావు, సుబ్బారెడ్డి, ఖాజామొహనుద్దిన్, లక్ష్మీకాంతారావు, భూపాల్ రెడ్డి, పూర్వ విద్యార్థులు ఆలంపల్లి శ్రీకాంత్, శ్రీనివాస్, సైదులు, శ్రీనివస్, వేణు, కవిత, పద్మ, హఫీజా, నాగమణి, భరత్, మట్టయ్య, భాస్కర్, నర్సింహచారి, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థినులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.